క్లుప్తంగా

ఇసుకతోటలో మహాన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, పల్లా దుర్గారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో కొలువైన కనకమాంబ అమ్మవారి వార్షిక మహోత్సవంలో భాగంగా ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. శ్రీకృష్ణ ఉమామహేశ్వర సాయి దుర్గా యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్‌లు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. 3 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని సంఘ అధ్యక్షుడు ఒమ్మి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఒమ్మి గోపికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు గొలగాని అప్పారావు, బొట్ట సింహాచలం(శివ), ఈగల సత్యం, ఉపాధ్యక్షులు పల్లా అప్పారావు, ప్రసాది అప్పారావు, జాయింట్ సెక్రటరీలు మువ్వల శ్రీను, ముగడ శేఖర్, కోశాధికారి గొలగాని అప్పలరాజు, సహాయ కోశాధికారి గొలగాని రామచంద్రావు, ఉప్పిలి కృష్ణంనాయుడు, ఈగల గోపి, ఒమ్మి గోపినాథ్, పల్లా శివ, కాకర రాము, ఒమ్మి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆటో చక్రాలు మాయం



రామకృష్ణాపురంలో వెనుక చక్రాలు చోరీకి గురైన ఆటో

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో రోడ్డుపై శనివారం రాత్రి నిలిపిన ఆటోకు తెల్లవారే సరికి చక్రాలు మాయమయ్యాయి. ఇక్కడ ఆటో యజమాని గ్రామం వైపు ఉన్న బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో ఆటో పార్క్‌చేశాడు. ఆదివారం ఉదయం ఆటో తీయడానికి ఇంటి నుంచి బయటకు వచ్చి చూసే సరికి దాని వెనుక రెండు చక్రాలు కనిపించలేదు. శనివారం అర్ధరాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆటో చక్రాలు విప్పేసి పట్టుకుపోయారు. దీంతో యజమాని లబోదిబోమన్నాడు. ఈ ప్రాంతంలో తరచూ ఆటోల్లో సీట్లు తొలగించి పట్టుకుపోవడం, బైక్‌ల్లో పెట్రోలు తీసేయడం వంటివి జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పోలీసులు రామకృష్ణాపురం వైపు నైట్ పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక



గణేష్ సాయి షటిల్ బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గ సభ్యులు

మద్దిలపాలెం: వెంకోజీపాలెంలోని వుడా కల్యాణ మండపం ఎదురుగా ఉన్న పార్కులో గణేష్ సాయి షటిల్ బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. కార్యవర్గ గౌరవ అధ్యక్షుడిగా మద్దాల శివ, అధ్యక్షుడిగా కాళ్ల ఆనంద్, ఉపాధ్యక్షుడిగా వేగి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పీలా కనకరాజు, కార్యదర్శిగా వేగి రమణ, కోశాధికారిగా కాళ్ల నాయుడు, ఆడిటర్‌గా దాడి ఈశ్వరరావు ఎన్నికయ్యారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ ధనుంజయ్‌నాయుడు

ఎంవీపీకాలనీ: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను ఎంవీపీ ఎస్‌ఐ ధనుంజయ్‌నాయుడు హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేరప్రవృత్తికి దూరంగా ఉండాలన్నారు. నగరంలో జరిగే ఎలాంటి సంఘటనల్లోనైనా రౌడీషీటర్ల పాత్ర ఉందని తేలితే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కౌన్సెలింగ్‌కు ఎవరూ గైర్హాజరు కావద్దని చెప్పారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దిష్టిబొమ్మలా రైలు బండి

కైలాసగిరిపై కదలని విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్



కైలాసగిరిపై పట్టాలు తప్పి మూడు నెలలుగా నిలిచిపోయిన విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్

- పట్టాలు తప్పి మూడు నెలలుగా మూలకు చేరిన వైనం
- సందర్శకులకు వినోదం కరువు
- పట్టించుకోని వీఎంఆర్‌డీఏ అధికారులు

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ నిర్వహిస్తున్న విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్ మూలకు చేరి మూడు నెలలైంది. వారంలో బాగుచేయించి పర్యాటకులకు వినోదం కోసం మళ్లీ పట్టాలపైకి ఎక్కిస్తామంటూ ప్రకటించిన అధికారుల మాటలు కార్యరూపం దాల్చలేదు. దీంతో మూడు నెలల నుంచి ఇది పట్టాలు తప్పిన చోటే కదలకుండా దిష్టిబొమ్మలా మారింది. ఈ సర్క్యూట్ ట్రైన్‌కు మరమ్మతులు చేపట్టకుండా వదిలేసిన అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది నాలుగు నెలలుగా మొరాయిస్తూ వస్తోంది. దీనికి అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టడంతో తరచూ మూలకు చేరుతోంది. కొండపై సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో తిరుగుతూ ఓ పక్క సముద్రం, మరో పక్క కొండలు, రెండు వైపుల నగర అందాలను చూపించే ఈ టాయ్ ట్రైన్ పిల్లలు, పెద్దలకు వినోదం కలిగిస్తుంది. ఇది మూలకు చేరడంతో కైలాసగిరికి వెళ్లే పర్యాటకులకు నిరాశ మిగిలింది.

నెల వ్యవధిలో రెండు సార్లు మొరాయింపు

టాయ్ ట్రైన్‌లో జనరేటర్ మొరాయించడంతో బోగీల్లోని ఏసీలు, ఫ్యాన్‌లు తిరగలేదు. బోగీల్లో



విరిగిన ట్రైన్ చక్రాలు

సీట్లు చిరిగిపోయాయి. దీంతో దీనికి మరమ్మతులు చేపట్టాలని ఈ ఏడాది ఫిబ్రవరి 1న దీన్ని నిలిపేశారు. అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి రెండు వారాల తర్వాత మళ్లీ పట్టాలు ఎక్కించారు. మార్చి 17న ట్రైన్ చక్రాలు విరిగిపోయి పట్టాలు తప్పింది. సుమారు 200 మీటర్ల దూరం వరకు వెళ్లి ఆగిపోయింది. ఆ సమయంలో పెద్ద ప్రమాదం తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అప్పటి నుంచి టాయ్ ట్రైన్ పట్టాలు తప్పినచోటే నిలిచిపోయింది. దీని గురించి అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. విదేశీ పర్యాటకులు సైతం సందర్శించే ఈ పర్యాటక కేంద్రంపై అలరించే టాయ్ ట్రైన్‌కు మరమ్మతులు జరిపించి వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారంటూ పలువురు విమర్శిస్తున్నారు. కనీసం విరిగిన చక్రాలను కూడా ఇంతవరకు తొలగించలేదు. అక్కడ పట్టాలను కూడా సరిచేయకుండా వదిలేశారు.

వీఎంఆర్‌డీఏ ఆదాయానికి గండి

సందర్శకులను ఎంతగానో ఆకట్టుకునే టాయ్ ట్రైన్ మూలకు చేరడంతో వీఎంఆర్‌డీఏకు రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. సాధారణంగా కైలాసగిరికి వేసవి తాకిడి పెరుగుతుంది. కార్తీక మాసంతోపాటు వేసవిలో ఏప్రిల్, మే నెలల్లో ఎక్కువ మంది సందర్శిస్తుంటారు. ఈ ఏడాది వేసవి సెలవుల్లోనే ఇది మూలకు చేరింది. ఇక్కడికి వెళ్లిన వారికి ఈ టాయ్ ట్రైన్ అలరిస్తుండేది. దీనిలో ఎక్కి కొండపై నుంచి విశాఖ నగర అందాలను తిలకించి ఎంజాయ్ చేసేవారు. వారి వల్ల వీఎంఆర్‌డీఏకు నెలకు రూ.లక్షల్లో ఆదాయం చేకూరుతుండేది. గతంలో ఓ ప్రైవేట్ వ్యక్తి దీన్ని నిర్వహించినప్పుడే నెలకు రూ.4 లక్షల నుంచి 5 లక్షలకు పైగా లీజు రూపంలో ఆదాయం లభించేది. ఇప్పుడు సుమారు రెండేళ్ల నుంచి వీఎంఆర్‌డీఏ సొంతంగా విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్‌ను నిర్వహిస్తుండటంతో నెలకు రూ.10 లక్షలు దాటుతుండేది. ఈ ఆదాయానికి మూడు నెలలుగా గండిపడింది. ఇంత ఆదాయం తెచ్చిపెడుతున్న ఈ టాయ్ ట్రైన్‌పై వీఎంఆర్‌డీఏ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారంటూ సందర్శకులు విమర్శిస్తున్నారు. టాయ్ ట్రైన్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



టాయ్ ట్రైన్ బోగీకి ఏర్పడిన రంధ్రాలు

శిథిలమవుతున్న ట్రైన్ బోగీలు, పట్టాలు

ఈ ఏడాది మార్చి 17న కైలాసగిరిపై టాయ్ ట్రైన్ సందర్శకులను తీసుకెళ్తుండగా తెలుగు మ్యూజియం ఎదురుగా చక్రాలు విరిగిపోయి పట్టాలు తప్పింది. అప్పటి నుంచి వీఎంఆర్‌డీఏ అధికారులు దానికి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో అక్కడే నిలిచిపోయింది. సుమారు మూడు నెలలుగా ఖాళీగా ఉన్న ఈ ట్రైన్ పట్టాలు తుప్పుపట్టి ముక్కలు రాలిపోతున్నాయి. ట్రైన్ బోగీ భాగాలు విరిగిపోతున్నాయి. కొన్నిచోట్ల వాటికి రంధ్రాలు, పగుళ్లు ఏర్పడ్డాయి. దీని ఏసీ బోగీలు, నాన్ ఏసీ బోగీల లోపల పర్యాటకులు కూర్చునే సీట్లు కొన్ని చిరిగిపోయాయి. కొన్ని సీట్లు ఊడిపోయాయి.



ట్రైన్ తిరగకపోవడంతో తుప్పు పడుతున్న పట్టాలు

క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావును సత్కరిస్తున్న నడింపల్లి కృష్ణంరాజు, పార్టీ శ్రేణులు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. పార్టీ 15వ వార్డు ఇన్‌చార్జి, జిల్లా ఉపాధ్యక్షుడు నడింపల్లి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆదివారం సీతమ్మధార రాధాకృష్ణ కల్యాణ మండపంలో వార్డు స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావుకు పార్టీ వార్డు శ్రేణులు గజమాల వేసి ఆత్మీయ సత్కారం చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, దౌర్జన్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపైన ఉందన్నారు. నడింపల్లి కృష్ణంరాజు మాట్లాడుతూ తూర్పులో పార్టీ బలోపేతానికి శ్రేణులందరూ కలిసికట్టుగా పనిచేయాలని, అందుకు నాయకులు, కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలని కోరారు. కమిటీ నియామకాల్లో 15వ వార్డులోని అన్ని బూత్‌ల సభ్యులు ఉండేలా చూసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, వార్డు నాయకులు కణితి మరియదాసు, గొలగాని త్రినాథ్, బుగత యేసురత్నం, ఆర్జి వెంకటలక్ష్మి, వెంకటరావు, నూకరాజు, రాజేష్, వేలంగిణి, రవణమ్మ, అచ్యుత, భాస్కరరావు, రవికుమార్, అనిల్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, నాయుడు, రాజారావు, నారాయణరావు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పనిచేద్దాం

జీవీఎంసీ 22వ వార్డులో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు కోరారు. పార్టీ 22వ వార్డు ఇన్‌చార్జి పీతల గోవింద్ ఆధ్వర్యంలో వార్డు కార్యాలయంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయనకు వార్డు శ్రేణులందరూ పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం మొల్లి అప్పారావు మాట్లాడుతూ పార్టీ ఏ కార్యక్రమం తలపెట్టినా వార్డు నుంచి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కమిటీ పదవుల్లో 22వ వార్డులోని అన్ని బూత్‌ల సభ్యులు ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ



22వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, వార్డు సీనియర్ నాయకులు పీతల మహేష్, పద్మరాణి, శశికళ, అప్పల నాయుడు, దాసు ,పీతల అప్పారావు, రావల చంద్రకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వ అసమర్థత, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. 21వ వార్డులో పార్టీ వార్డు ఇన్‌చార్జి మదుపాడు రవి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలు ఇప్పుడు అందకపోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా పార్టీ బలోపేతమయ్యేలా అందరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



21వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

రామకృష్ణాపురంలో పైడిమాంబ ఉత్సవాల సందడి



అలంకరణలో పైడిమాంబ



అమ్మవారి ప్రతిమకు పంచామృతాభిషేకాలు చేస్తున్న మహిళలు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో కొలువైన పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గ్రామాభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు ఈ నెల 24 వరకు కొనసాగుతాయి. మొదటి రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు చేశారు. స్థానిక మహిళలు అమ్మవారి ప్రతిమకు పంచామృతాభిషేకాలు జరిపారు. ఆలయం వద్ద సాయంత్రం బుర్రకథ ప్రదర్శించారు. సోమవారం అమ్మవారికి తొలేళ్ల పండగ, మహిళలతో సామూహిక కుంకుమార్చనలు, సాయంత్రం కూచిపూడి, భరత నాట్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సేవా సంఘం సభ్యులు తెలిపారు. మంగళవారం పైడిమాంబకు అర్చనలు, పూజలతోపాటు అమ్మవారి ప్రతిమ ఊరేగింపు, జాతర, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

మహిళల చెస్ టైటిల్ హేమిషా కైవసం



హేమిషా, కుమారి మధ్య ఆసక్తికరంగా సాగుతున్న చెస్ పోరు

విశాఖ స్పోర్ట్స్: జిల్లా మహిళల చదరంగం చాంపియన్‌షిప్‌ను ఎస్.హేమిషా కైవసం చేసుకుంది. జి.కుమారి రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం శ్రీ కశ్యప్ జూనియర్ కళాశాలలో ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మొత్తం 63 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. వీరిలో ఆరుగురు ఫిడే ర్యాంకింగ్ సాధించిన వారు ఉండటం విశేషం. టోర్నీలో రెండో ర్యాంక్‌తో(1656 ఫిడే రేటింగ్) బరిలోకి దిగిన జి.కుమారి, చివరిదైన ఆరో రౌండ్‌లో మూడో ర్యాంక్‌తో ఆడిన ఎస్.హేమిషా (1490 రేటింగ్)తో డ్రాగా ముగించింది. పాయింట్లలో సమానంగా నిలిచినప్పటికీ, టైబ్రేకర్స్‌లో కుమారి వెనుకబడటంతో హేమిషా విజేతగా నిలిచింది. టి.బంధవిక, డి.దివ్య(1463), హెచ్‌ఎస్ బుష్రా ఐదు పాయింట్లు సాధించినప్పటికీ, టైబ్రేకర్లలో వెనుకబడి జిల్లా జట్టుకు ఎంపిక కాలేకపోయారు. ఎరీనా కాండిడేట్ మాస్టర్ ఎం.మనస్వి(1489)తోపాటు ప్రవల్లిక, ఆశ్రిత, లలిత్యా నాలుగున్నరేసి పాయింట్లతో టోర్నీని ముగించారు. ఫిడే రేటర్ మనస్వికి జిల్లా జట్టులో స్థానం దక్కలేదు. ఆరీనా ఫిడే మాస్టర్ ఎస్.గౌర్లి పోటీలకు హాజరు కాకపోవడం గమనార్హం. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్న ఏపీ అంతర్ జిల్లాల మహిళల చాంపియన్‌షిప్‌కు అర్హత లభించింది.

‘యువత పోరు’కు పెన్షనర్స్ అసోసియేషన్ మద్దతు

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి విశాఖ జిల్లా ఎంప్లాయిస్, పెన్షనర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. ఈ నెల 23న వైఎస్సార్‌సీపీ యువత పోరు పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం ఎంవీపీ కాలనీలో అసోసియేషన్ ప్రతినిధులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యువతను దారుణంగా మోసం చేసిందన్నారు. ఏడాది పాలనలో యువతకు చేసిందేమి లేదని దుయ్యబట్టారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై యువతకు అపారమైన నమ్మకం ఉందన్నారు. దాదాపు 3 లక్షల ఉద్యోగాలు కల్పించడం ద్వారా యువతకు ఆయన బంగారు భవిష్యత్ కల్పించారని చెప్పారు. కూటమి మోసాలను ఎండగడుతూ యువత పోరుకు అండగా నిలవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పైడిరాజు రెడ్డి, ఎం.లోకనాథం, యు.అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.



యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మార్కండేయులు, అసోసియేషన్ సభ్యులు

త్వరలో వెలమ గర్జన సభ

ఏయూక్యాంపస్: వెలమ సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయంపై గళమెత్తుతూ త్వరలో విశాఖ వేదికగా వెలమ గర్జన సభను నిర్వహిస్తామని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు తెలిపారు. బీచ్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షలకు పైగా ఉన్న వ్యవసాయ ఆధారిత వెలమ సామాజిక వర్గానికి దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయాన్ని సభలో వివరిస్తామన్నారు. ఆర్థిక, సామాజిక రంగాల్లో తగిన ప్రాధాన్యమివ్వాలని, వెలమ వర్గాన్ని బీసీ–డీ నుంచి ఏలోకి మార్చాలని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వెలమ సామాజిక భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ తరహాలో కూటమి ప్రభుత్వం వెలమ సామాజిక వర్గానికి ఉప ముఖ్యమంత్రి పదవిని కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, జిల్లా ఇన్‌చార్జి రెడ్డి ఈశ్వరరావు, అనకాపల్లి ఇన్‌చార్జి బర్ల పైడంనాయుడు, ప్రధాన కార్యదర్శి గంగు మన్మధరావు, వరుదు రాజ్‌కుమార్, పెదిరెడ్ల శ్రీనివాస్, గొల్లు శ్రీనివాస్, మూకల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

వేడుక ముగిసింది.. శుభ్రత మిగిలింది

- బీచ్ రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలు
- ఫుట్‌పాత్‌లపై ఆయిల్, కేబుల్ వైర్లు
- తొలగింపు పనుల్లో పారిశుధ్య సిబ్బంది



తరలించడానికి సిద్ధం చేసిన మొక్కలు

ఏయూక్యాంపస్: విశాఖ బీచ్ రోడ్డు వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతంగా ముగిసింది. కార్యక్రమ అనంతరం తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం పారిశుధ్య సిబ్బందికి ఇబ్బందిగా మారింది. ఆదివారం ఉదయం ప్రధాన వేదిక అలంకరణకు వినియోగించిన పువ్వులు, ఇతర వ్యర్థాలను తొలగించడం, రహదారులపై పేరుకున్న వ్యర్థాలను తొలగించే పనిలో పారిశుధ్య సిబ్బంది మునిగిపోయారు. తీరం పొడవునా యోగా డే ఏర్పాట్లలో భాగంగా ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. అక్కడ ప్రత్యేకంగా ఒక ట్యాంక్‌లో ఆయిల్ వంటిది వినియోగించారు. మిగిలిన ఆయిల్‌ను ఫుట్‌పాత్‌లు, రోడ్డుపైన పారబోసారు. దీంతో ఫుట్‌పాత్‌లు మురికిమయంగా మారిపోయాయి. వీటిని తొలగించడం, శుభ్రం చేయడం పారిశుధ్య సిబ్బందికి తలకు మించిన భారంగా మారనుంది. దీనిపై కాలువేస్తే జారిపడే ప్రమాదం కూడా ఉంది.



ఆర్.కె.బీచ్ వద్ద శుభ్రం చేస్తున్న కార్మికులు

రోడ్డు పక్కన పడేశారు..

ప్రజలు వాడిన మంచినీటి గ్లాసులు, ఇతర కవర్లు, భోజనం ప్లేట్లు వంటివి రోడ్డు పక్కనే పడేశారు. వీటిని ఇంకా తొలగించాల్సి ఉంది. దారి పొడవునా అనేక ప్రాంతాల్లో మంచినీటిని జీవీఎంసీ ఏర్పాటు చేసింది. అక్కడ వినియోగించిన పేపర్ గ్లాసులు, ఇతర వస్తువులను తొలగించడం, శుభ్రం చేయడంలో పారిశుధ్య సిబ్బంది సిద్ధమవుతున్నారు.

నీరు లేక ఎండిపోతున్న మొక్కలు

సుందరీకరణలో భాగంగా బీచ్ రోడ్డులో ఉంచేందుకు తీసుకొచ్చిన పలు మొక్కలను తిరిగి తీసుకెళ్లే పనులు ఆదివారం ఉదయం ప్రారంభించారు. కుండీలు, కవర్లతో తీసుకొచ్చి డివైడర్ల మధ్యలో ఉంచిన మొక్కలను ఎక్కడికక్కడ సేకరించి తొలగించే పనుతు జరుగుతున్నాయి. నాలుగైదు రోజులుగా నీరు లేకపోవడంతో పలు మొక్కలు ఎండిపోయే స్థితిలో ఉన్నాయి. బీచ్ రోడ్డులోని లాన్స్‌లో నాటికి కొద్దిపాటి మొక్కలు నీరు లేక నీరసించి, ఎండిపోయే స్థితికి చేరుకుంటున్నాయి. కొన్ని చోట్ల లాన్స్‌లో ప్యాచ్ వర్క్‌లు చేశారు. వీటికి సైతం నీరు పెట్టాల్సిన అవసరం ఉంది. ఇంటర్‌నెట్ కల్పనలో భాగంగా కేబుల్ వైర్లను విపరీతంగా వేశారు. ప్రస్తుతం వీటిని కట్ చేసి ఎక్కడివక్కడే వదిలేశారు. బీచ్‌లో వాకింగ్ చేసే వారికి ఇవి కాళ్లకు అడ్డం పడుతున్నాయి. బీచ్ రోడ్డును శుభ్రం చేసి, కేబుల్ వైర్లను త్వరగా తరలించాలని సందర్శకులు కోరుతున్నారు.



బీచ్ రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలు



బీచ్ రోడ్డులోని ఫుట్‌పాత్‌పై పారబోసిన ఆయిల్



ఎండిపోతున్న సుందరీకరణ మొక్కలు